క్లుప్తంగా

హైదరాబాద్ తరలిన రైతు సంఘం శ్రేణులు



సిరికొండ: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో పాల్గొనడానికి సంఘం నాయకులు గురువారం హైదరాబాద్ తరలి వెళ్లారు. ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పాల్గొననున్నట్లు వారు తెలిపారు. సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ, రమేష్, అనీష్, ఎర్రన్న, కిషోర్, ఆశిష్, భూమాగౌడ్ తదితరులు వెళ్లారు.

నేడు ఎల్లారెడ్డిపల్లెలో ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’

ఇందల్వాయి: ఎల్లారెడ్డిపల్లె గ్రామంలో నేడు ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సాధించిన రైతులతో పాటు శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు అధునాతన వ్యవసాయ పద్ధతులు, మేలైన వంగడాలపై రైతులకు అవగాహన కల్పిస్తారని అన్నారు.

11న పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్ భవన్‌లో సదస్సు


నిజామాబాద్‌నాగారం: నగరంలోని పెన్షనర్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ భవన్(సుభాష్‌నగర్)లో ఈ నెల 11న ‘పెన్షన్ ప్రమాదంలో పడనున్నదా..’ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయీస్ స్టడీ సర్కిల్ కన్వీనర్ రామ్మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ఇన్సూరెన్స్ ఉద్యోగుల జాతీయ నాయకులు తిరుపతయ్య, నిజామాబాద్ జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘ నాయకులు నాశెట్టి సుమన్, అలుక కిషన్, మామిడాల రవీందర్, కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, బ్యాంకు ఉద్యోగుల నాయకులు మనోజ్‌సింగ్, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నాయకులు ఈపీఎల్ నారాయణ పాల్గొంటారని తెలిపారు.

బాధిత మహిళకు ఐద్వా నేతల పరామర్శ




నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌కు చెందిన లక్ష్మి అనే వివాహిత భర్త చేతిలో భౌతికదాడులకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. ఈ విషయం తెలిసి ఐద్వా నాయకులు ఆమెను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. లక్ష్మి భర్త శ్రీకాంత్ తనపై అనుమానంతో నిత్యం హింసిస్తూ తీవ్రంగా కొడుతున్నాడని తెలిపింది. వివాహమై ఎనిమిదేళ్లు అవుతున్నా ఆయన ప్రవర్తన మారలేదని, అనుమానంతో వేధిస్తూ భౌతిక దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయని.. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపింది. భర్త శ్రీకాంత్‌పై పోలీసులు కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని ఐద్వా నాయకులు కోరారు. నాయకులు కళ, స్వప్న, సుజాత ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బోధన్: సాలూర మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితులకు చెక్కులను అందించామని నాయకులు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, హున్సా సొసైటీ చైర్మన్ మందర్నా రవి, సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, నాయకులు అల్లె రమేశ్, ఆవుల పద్మారెడ్డి(సాలంపాడ్ క్యాంప్), జోజయ్య పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని రామనగర్ కాలనీలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల వాల్‌పోస్టర్లను గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. శ్రీ కేదారీశ్వర ఆశ్రమ కమిటీ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్, హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో ఈ నెల 14, 15, 16వ తేదీలలో ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రెవెన్యూ పనులకు బ్రేక్

- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు
- దళారులుగా మారిన కిందిస్థాయి సిబ్బంది



నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారుల లేమి కొట్టొచ్చినట్లు కనపడుతోంది. పనుల కోసం నిత్యం నగరవాసులు చక్కర్లు కొడుతున్నారు. అనుమతుల కోసం చెప్పులరిగేలా తిరుగుతున్నారు. పనులు కాక ఇబ్బంది పడుతున్నారు. కార్పొరేషన్‌కు ప్రధాన ఆదాయ వనరు రెవెన్యూ విభాగం. కొన్ని నెలలుగా ఈ విభాగం సుప్తావస్థలో ఉంది. డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన రాజేంద్రకుమార్ రిటైర్ అయిన తర్వాత ఆ స్థానంలో కొత్తవారెవరూ చార్జి తీసుకోలేదు. దాంతో ఆ విభాగానికి హెడ్ లేకుండా పోయారు. ఆ స్థానాన్ని తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

పనులు చేయిస్తామంటూ..

బల్దియాలో పూర్తిస్థాయిలో అధికారులు లేరన్నది తెలిసిన విషయమే. మున్సిపల్ కమిషనర్ మెతక స్వభావం కొందరికి కలిసివస్తోంది. ఈ అవకాశాన్ని కొందరు తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. సందట్లో సడేమియాలా కిందిస్థాయి సిబ్బంది దళారుల అవతారం ఎత్తుతున్నారు. అమాయకుల దగ్గర అందినకాడికి దండుకుంటున్నారు. పనుల కోసం బల్దియాకు వస్తున్నవారితో మాటలు కలిపి, పనులు చేయిస్తామంటూ ముందుగా సొమ్ము తీసుకుంటున్నారు.

ఆర్‌వోలు ఉన్నా.. లేనట్టే..

బల్దియాలో డిప్యూటీ కమిషనర్ తర్వాత స్థానం రెవెన్యూ ఆఫీసర్‌లదే. పేరుకు మాత్రం ఇద్దరు ఆర్‌వోలున్నారు. మహ్మద్ నజీర్ ఆర్వోగా విధులు నిర్వర్తించనని మొండికేయడంతో ఆయన స్థానంలో మహ్మద్ ఖదీర్ పాషాను ఆర్‌వోగా నియమించారు. మహ్మద్ నజీర్‌కు ఆర్టీవో, కోర్టు కేసులు అప్పగించారు. మహ్మద్ ఖదీర్‌పాషా మార్చి నుంచి రెవెన్యూకు సంబంధించిన పనులు చూస్తున్నారు. అయితే కేవలం పన్నుల వసూళ్లకు సంబంధించిన పనులు మాత్రమే చూడటంతో ఇతర పనులన్నీ పెండింగ్‌లో పెడుతున్నారు. పేరుకు ఇద్దరు ఆర్‌వోలున్నా కార్యాలయంలో మాత్రం ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. వీరిద్దరికి ఇటీవలే పదోన్నతులు కూడా వచ్చాయి.

ఆరు నెలలుగా తిరిగినా పని కాలేదు

బోర్గాం(పి)లో మా పెద్దల ఇల్లు తొలగించి, దాని స్థానంలో కొత్త ఇంటి నిర్మాణం అనుమతి కోసం ఆరు నెలలుగా తిరుగుతున్నా. రికార్డులు దొరకడం లేదంటారు. సార్లు లేరంటారు. మళ్లీ రమ్మంటారు. అప్పటి డిప్యూటీ కమిషనర్, కమిషనర్‌ను కూడా కలిశా. పనులు కావడం లేదు. ఇక జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేద్దామనుకుంటున్నా.

– రాజశేఖర్‌రెడ్డి, బోర్గాం(పి)

మళ్లీ అనుమతి తీసుకోవాలంటున్నారు

మాకు హెర్బల్ ప్రొడక్ట్ ఫ్రాంచైజీ ఉంది. ప్రతి సంవత్సరం ట్రేడ్ ఫీజు చెల్లిస్తున్నాం. ఈ సారి రెవెన్యూ అధికారులు తనిఖీచేసి మా దుకాణం కొలతలు నిబంధనల ప్రకారం లేవంటున్నారు. కొత్తగా అనుమతి తీసుకోవాలంటున్నారు. కొన్నేళ్లుగా లేని నిబంధన ఇప్పుడు కొత్తగా ఏమిటో చెప్పరు. మాతోపాటు మరో 20 దుకాణాలున్నాయి. వాటి గురించి పట్టించుకోరు.

– కృష్ణ మనోహర్, ఖలీల్‌వాడి

సమస్యలుంటే నేరుగా సంప్రదించండి

రెవెన్యూ, శానిటేషన్ సమస్య ఏదైనా నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తా. దళారులను సంప్రదించవద్దు. రెవెన్యూ సిబ్బంది మొన్నటివరకు రెవెన్యూ వసూళ్లలోనే ఉన్నారు. ఇప్పుడే ఫ్రీ అయ్యాం. జాప్యం లేకుండా పనులు జరుగుతాయి.

–దిలీప్ కుమార్, బల్దియా కమిషనర్

ప్రధాని, కేంద్ర మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు,కార్యకర్తలు

డిచ్‌పల్లి: సుద్దపల్లి శివారులోని సీఎంసీ మెడికల్ కళాశాల జంక్షన్ వద్ద అండర్ పాస్ వంతెన నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.38 కోట్లు నిధులు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ మండల బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ పటేల్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. అండర్ పాస్ వంతెన లేక తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. సీఎంసీ మీదుగా డిచ్‌పల్లితో పాటు ఆర్మూర్, జక్రాన్‌పల్లి, ధర్పల్లి మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. వంతెన నిర్మాణంతో ఆ ఇబ్బంది తొలగుతుందన్నారు. మాజీ వైస్ఎంపీపీ కులాచారి శ్యాంరావు, పార్టీ నాయకులు అంతరెడ్డి గంగారెడ్డి, బాలయ్య, లక్ష్మణ్, విఠల్, పరుశురాం, వినోద్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రస్థావరాలపై మన సైనికుల చర్య భేష్



కృష్ణానందస్వామి

డిచ్‌పల్లి: జమ్మూ-కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలు హరించిన ఉగ్రవాదులను తుదముట్టించిన భారత సైన్యం ధైర్య సాహసాలు భేష్ అని తెలంగాణ సాధుపరిషత్ ప్రచార కార్యదర్శి కృష్ణానందస్వామి పేర్కొన్నారు. గురువారం సాక్షితో మాట్లాడుతూ.. పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తుందని మండిపడ్డారు. ఉగ్రవాదం ఎక్కడున్నా దాన్ని అంతమొందించాల్సిందేనన్నారు. మన పురాణాల్లో కూడా దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేశారన్నారు. కురుక్షేత్ర యుద్ధానికి ముందే ఆంజనేయుడు జెండాపై కపిరాజుగా విజయం సాధించినట్లు యుద్ధాని కంటే ముందే మన సైనికులు ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేసి విజయం సాధించారన్నారు. ప్రధాని మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయం అభినందనీయమన్నారు. ఈ యుద్ధంలో కూడా విజయం తథ్యమన్నారు.

సమాచారం..

నేడు జరిగే అభివృద్ధి కార్యక్రమాలు వాయిదా

వేల్పూర్: భారత్- పాకిస్తాన్ సరిహద్దులో ఏర్పడిన ఉద్రిక్తత, యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం బాల్కొండ నియోజకవర్గంలో జరగాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు వాయిదా వేసినట్లు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాకిస్తాన్‌పై దాడి చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టడం.. ఒక భారతీయుడిగా ఈ చర్యను సమర్థిస్తూ గర్విస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరం ఏకమై సైన్యానికి మద్దతుగా నిలబడాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం..

బాల్కొండ: బాల్కొండ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బాల్కొండ ఏఈఈ కిషన్ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉండటం వల్ల బాల్కొండ, కిసాన్‌నగర్ గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

బోధన్/నందిపేట/పెర్కిట్/వేల్పూర్/డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(జెడ్పీహెచ్ఎస్)లో, వేల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, నందిపేట జెడ్పీహెచ్ఎస్‌లో, సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 10 నుంచి 25 వరకు విద్యార్థులకు ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల ఎంఈవోలు రామకృష్ణ, రేణుక, నరేందర్, అవధూత గంగాధర్, రాజీ మంజూషలు వేర్వేరుగా తెలిపారు. 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఆర్ట్ క్రాఫ్ట్, డ్రాయింగ్, పెయింటింగ్, తదితర విషయాల్లో శిక్షణ ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వలస వచ్చిన నేతలకు కాంగ్రెస్‌లో ప్రాధాన్యత



మోస్రాలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నేతలు

వర్ని: ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో ఉండి పార్టీ పటిష్టతకు కృషి చేసిన నాయకులను వదిలేసి నిన్న మొన్న ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ఇందిరమ్మ ఇండ్ల కమిటీలో ప్రాధాన్యత కల్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మోస్రా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. గురువారం మోస్రా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంతియాజ్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. అసలైన కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేస్తున్నారని ఇంతియాజ్ ఆరోపించారు. వలస నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకుపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికైనా పార్టీ అధినాయకత్వం ఈ విషయంలో శ్రద్ధ తీసుకొని పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ప్రోత్సహించాలని కోరారు.

చెరువులో ఇష్టారీతిన తవ్వకాలు



పెద్ద చెరువులో మొరం తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చుతున్న పొక్లెయిన్

- అభివృద్ధి పేరుతో మొరం తరలింపు
- క్వారీ నిర్వాహకుల దారి మళ్లిస్తున్నారని గ్రామస్తుల ఆరోపణ

బోధన్: రెవెన్యూ డివిజన్‌లో పలు చోట్ల మొరం తవ్వకాలు, రవాణా వివాదాస్పదంగా మారుతున్నాయి. అభివృద్ధి పేరుతో అనుమతులు పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా మొరం దారి మళ్లిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయి. చెరువుల్లో మొరం తవ్వకాలకు అనుమతిలిచ్చి అధికారులు తవ్వకాలు, రవాణాపై పర్యవేక్షణ లేకుండా పోయిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంట్రాక్టర్ల లాభాపేక్ష వల్ల చెరువుల్లో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. సాలూర మండలంలోని హున్సా శివారులో ప్రభుత్వం మంజూరు చేసిన మొరం రోడ్డు నిర్మాణం కోసం డివిజన్ ఇరిగేషన్ శాఖ అధికారులు జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువులో ఈ నెల 7, 8, 9, 12 తేదీల్లో మొరం తవ్వకాలు, తరలింపునకు అనుమతి ఇచ్చారు. ఇందుకు 8 టిప్పర్లకు రవాణాకు అనుమతి ఇస్తున్నట్లు అనుమతి పత్రంలో పేర్కొన్నారు. కాగా చెరువులో పొక్లెయినర్‌తో మొరం తవ్వకాలు చేపట్టారు. దీంతో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం మూడు నాలుగు ఫీట్లలోతు వరకు తవ్వకాలు చేపట్టాలని అధికారులంటున్నారు. కాని ఇక్కడ 7 ఫీట్ల కంటే ఎక్కువ లోతులోనే తవ్వకాలు జరిగాయి. గ్రామస్తులు కొందరు అధికారులకు ఫోన్ల ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అభివృద్ధి పనుల పేరుతో చెరువును ధ్వంసం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. భారీ గుంతల వల్ల చెరువు నీరు తూమునుంచి బయటకు వెళ్లే పరిస్థితి ఉండదని వారంటున్నారు. మొరం తవ్వకాలతో ఏర్పడిన గుంతలను గురువారం సాయంత్రం ప్రొక్లెయిన్‌తో పూడ్చివేత పనులు చేపట్టారు.

నాలుగు రోజుల పాటు అనుమతిచ్చాం

మొరం తవ్వకాలు, తరలింపునకు నాలుగు రోజుల పాటు అనుమతిఇచ్చాం. క్వారీ నిర్వాహకులు మొరం దారి మళ్లిస్తున్నారని గ్రామస్తుల నుంచి ఫోన్‌లో సమాచారం, ఫిర్యాదులు వచ్చాయి. మొరం దారి మళ్లిస్తే కేసులు నమోదు చేస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదు.

– బలరాం, ఇరిగేషన్ డివిజన్ ఈఈ, బోధన్

చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ



పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

రుద్రూర్: పోతంగల్ మండలంలోని రెండు చెక్‌పోస్టులను గురువారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోతంగల్ శివారులోని మంజీరా సమీపంలో ఇసుక ట్రాక్టర్‌లను ఆపి వేబిల్లులు పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిఘా ఉంచాలని చెక్‌పోస్టు సిబ్బందికి సూచించారు. మహారాష్ట్ర నుంచి ధాన్యం రాకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి కొత్త రేషన్ కార్డుల ఎంక్వైరీ వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఊహించని దాడికి దేశవ్యాప్తంగా ప్రశంసలు



మాట్లాడుతున్న కామిడి సతీష్‌రెడ్డి

నిజామాబాద్ రూరల్: ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం చేసిన ఊహించని దాడికి దేశ వ్యాప్తంగా ప్రశంసలు దక్కుతున్నాయని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి అన్నారు. వినాయక్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సైనికుల దాడిలో ఉగ్రవాదులు మరణించడం పహల్గాం మృతులకు నిజమైన నివాళులన్నారు. మతం అడిగి మరీ 26 మంది అమాయకుల ఉసురు తీసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సోషల్ మీడియా అంతా భారత సైన్యానికి జేజేలు పలుకుతోందని భారత్ మాతా కీ జై’, ‘మేమంతా మీ వెంటే’.. అంటూ నెటిజన్లు పోస్టులు పెడుతున్నారని తెలిపారు. భారత సైన్యానికి వందనాలన్నారు. త్రివిధ దళాలకు వెన్నంటి నిలబడ్డ ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులు ప్రేమ్‌లాల్, వేముల శేఖర్, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలి



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, అపార్ట్‌మెంట్‌వాసులు

నిజామాబాద్ రూరల్ : నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద గల కృష్ణ మందిర్ రోడ్‌లో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు నూతనంగా వచ్చిన ఏసీపీ మస్తాన్ అలీని కోరారు. గురువారం ఏసీపీకి ట్రాఫిక్ సమస్యలపై ప్రొద్దుటూరు, అల్లోల, నీలకంఠేశ్వర అపార్టమెంట్‌కు చెందిన ప్రజలతో కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం విఠల్‌రావు మాట్లాడుతూ.. కృష్ణ మందిర్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఉండేదని, దాని తొలగించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలని ఏసీపీని కోరామన్నారు. వారం పది రోజుల్లో ట్రాఫిక్ ఇబ్బంది కాకుండా అక్కడ భారీ గేట్లను ప్రయాణ సూచికలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పూర్తయిలో సిగ్నల్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూస్తామని వివరించారు. అనంతరం ఏసీపీని సన్మానించారు. ఉమామహేశ్వర్ రెడ్డి, పవన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, విభీషణ్ రెడ్డి, రాజాగౌడ్ గంగారెడ్డి, ప్రభాకర్, రచన అపార్ట్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

శివాజీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి



తగిలేపల్లిలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాసుల, తదితరులు

వర్ని: మరాఠా యోధుడు, ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం తగిలేపల్లిలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శివాజీ పోరాట స్ఫూర్తిని కొనియాడారు. మల్లారం ఆశ్రమ మహారాజ్ పీట్ల కృష్ణ మహరాజ్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బుద్ధ పూర్ణిమ మహోత్సవం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

ఆర్మూర్‌టౌన్: అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న మెట్‌పల్లిలో నిర్వహించనున్న బుద్ధ పూర్ణిమ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఆర్మూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇత్వార్‌పేట్ లింగన్న మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి గౌతమ బుద్ధుడి బోధనలతో సాధ్యమని పేర్కొన్నారు. దళిత, బహుజనులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ జానపద గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల, ప్రఖ్యాతి కవి జైరాజ్, తదితరులు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. నాయకులు కొంతం మురళీధర్, పింజ సుదర్శన్, కొంత పూర్ణచందర్, ద్యావతి రవి, రాజు, గైని సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 సింగిల్ -11.00, 4.40
హిట్-1.30, 7.30
జగదేకవీరుడు అతిలోక సుందరి-10.30
స్క్రీన్-2 సింగిల్-1.30, 7.30, 10.30
స్క్రీన్-3 జగదేకవీరుడు అతిలోక సుందరి-11.00, 4.30
శుభం-1.40, 7.20, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 సచిన్-11.20,
సింగిల్-1.40, 7.25, 10.10 -రైడ్-2(హిందీ)-4.25
స్క్రీన్-2 తుడరుమ్-11.20
శుభం-2.40, 5.20, 8.00, 10.40
స్క్రీన్-3 జెర్సీ-11.00 - రైడ్-2(హిందీ)-1.45
కలియుగం-8.00 - హిట్-4.45, 10.25
స్క్రీన్ -4 సీఎం పెళ్లాం-11.40
జగదేకవీరుడు అతిలోకసుందరి-2.30
బ్లైండ్‌స్పాట్-5.40- రైడ్-2(హిందీ)-7.45
తుడరుమ్-10.40
లలితామహల్ శుభం దేవి సింగిల్
నటరాజ్ జగదేకవీరుడు అతిలోకసుందరి
విజయ్ హిట్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,500	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	90,927		

- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సుడ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	10	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	50	పచ్చిమిర్చి	35	50
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	35	60	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	8	16
కాకరకాయ	30	50	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	70	100	చామగడ్డ	60	80
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	30	50

-సుభాష్‌నగర్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ & రూరల్ జి. రాంనాథ్ : 9849180084
బాల్కొండ ప్రవీణ్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899